https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

తాజా తెలుగు వార్తలు

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

4 PM TO 7 PM

సంపుటి: 01 / సంచిక:29 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / సోమవారం, సెప్టెంబర్ 14,2026



## "యాత్ర ఫర్ చేంజ్ "

### పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 14:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీఆర్వో ఎం.శ్రీధర్ రాసిన "యాత్ర ఫర్ చేంజ్ " పుస్తకాన్ని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ, పంచాయత్ రాజ్ శాఖల మంత్రి సీతక్క ప్రజా భవన్ లో ఆవిష్కరించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే వరకు సాగిన రేవంత్ రెడ్డి రాజకీయ ప్రయాణానికి సంబంధించిన పుస్తక రూపమే "యాత్ర ఫర్ చేంజ్ ". లక్ష్యాన్ని సాధించడంలో ఎదురైన అవరోధాలు, వాటిని దాటుకుని రేవంత్ రెడ్డి ముందుకు సాగిన తీరు నేటి తరం రాజకీయ నాయకులకు ఎంతో ఆదర్శమని మంత్రి సీతక్క అన్నారు. ఈ తరం నాయకులలో ఈ పుస్తకం ఒక స్ఫూర్తిని నింపుతుందని సీతక్క ఆకాంక్షించారు.



## మతం రంగు పులమడం సముచితం కాదు

### -అంతర్జాతీయ లాయర్ డా.రాజేష్ కుమార్

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 14:**



ఇటీవల కెనడాలో భారతీయ మహిళపై జరిగిన సంఘటనపై అంతర్జాతీయ లాయర్ డాక్టర్ కరణం రాజేష్ కుమార్ స్పందించారు. ఈ ఘటనకు మతపరమైన రంగు పులమడం సముచితం కాదని, ఇది ప్రాథమికంగా అద్దె నివాసంలోని ఆస్తి నష్టానికి సంబంధించిన వివాదమని అంతర్జాతీయ లాయర్ డాక్టర్ కరణం రాజేశ్ కుమార్ పేర్కొన్నారు. దర్యాప్తు పూర్తికాకముందే నిర్ధారణలేని ప్రచారం చేయవద్దని, భారతీయులు స్థానిక చట్టాలను గౌరవిస్తూ వివాదాల పరిష్కారానికి పోలీసులను, టెనెన్సీ అధికారులను న్యాయవాదులను సంప్రదించాలని ఆయన సూచించారు.

## 18 అసెంబ్లీ నియోజకవర్గాలకు తెలంగాణ రక్షణ సేన ఇంచార్జ్ ల నియామకం

### పలు నియామకాలు ప్రకటించిన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 14:**

రాష్ట్రంలో మరో 18 అసెంబ్లీ నియోజకవర్గాలకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఇన్ చార్జీలను ప్రకటించారు. మెదక్ లోక్ సభ సహా పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా సోమవారం నూతన నియామకాలు ప్రకటించారు. ఇప్పటికే 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇంచార్జ్ లను ప్రకటించిన కవిత తాజా నియామకాలతో మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు ఇంచార్జ్ లను నియమించారు. గతంలో మాదిరిగానే అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ లు , జిల్లా అధ్యక్షుల నియామకాల్లో బీసీలకు పెద్దపీట వేశారు.

## దిశా శాలియన్ మృతి కేసులో ఆదిత్య ఠాక్రే పై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు

**న్యూ ఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్14 :**



బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ మాజీ మేనేజర్ దిశ శాలియన్ మృతి కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) ఎఫ్ఆర్ఐ చేసింది. దీనిలో మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే నటులు డినో మోరియా, రియా చక్రవర్తి పేర్లు ఉన్నట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. హత్య, సామూహిక అత్యాచారం, సాక్ష్యాలను ధ్వంసం చేయడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తును బాంబే హైకోర్టు సీబీఐకి అప్పగించిన రెండు వారాల తర్వాత ఎఫ్ఎఆర్ నమోదయ్యింది.'ఈ ఘటన జరిగిన సమయంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే ఈ కేసును బయటకు రాకుండా చేయడానికి అనేక ప్రయత్నాలు చేశారు. సాక్ష్యాలను కప్పిపుచ్చడంలోనూ కీలక పాత్ర పోషించారు. ఆయన ఆదేశాల మేరకే ప్రభుత్వ అధికారులు, పోలీసులు కేసు పత్రాలు, ఇతర ప్రభుత్వ రికార్డులను ధ్వంసం చేశారు. ఇందుకుగాను వారందరూ విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని అధికారులు ఎఫ్ఎఆర్ పేర్కొన్నారు. మరోవైపు, దిశ మరణానికి సంబంధించిన అన్ని పత్రాలు, రికార్డులను తమకు అందించాలని దర్యాప్తు సంస్థ పోలీసులకు లేఖ రాసింది. దీంతో మహారాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి. కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుందని కేంద్రం పై మీద ఆదిత్య ఠాక్రే దుయ్యబట్టారు.

## ఆర్డీఆర్ స్మరణలో..


## సుధీర్ రెడ్డి రక్తదానం !

**సూర్యాపేట, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 14:**

తెలంగాణ సమాజానికి, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు మాజీ మంత్రివర్యులు దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. దామోదర్ రెడ్డి జయంతి వేడుకలను పురస్కరించుకుని సోమవారం సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పెన్ పహాడ్ మండలానికి చెందిన యువజన నాయకుడు సంకరమద్ది సుధీర్ రెడ్డి పాల్గొని రక్తదానం చేశారు. ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. రక్తదానం చేసిన అనంతరం కాంగ్రెస్ యువనేత సంకరమద్ది సుధీర్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. నిరుపేదల పెన్నిధి, ప్రజా నాయకుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆశయ సాధనలో భాగంగా ఆయన జయంతి రోజున రక్తదానం చేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. "ఒకరి ప్రాణాన్ని కాపాడే రక్తదానానికి మించిన దానం మరొకటి లేదు. యువత అంతా కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సమాజానికి దిశా నిర్దేశం చేయాలి" అని పిలుపునిచ్చారు. దామోదర్ రెడ్డి చూపిన బాటలో నడుస్తూ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, ఉపాధ్యక్షురాలు శ్రావ్య సుధీర్ రెడ్డి లతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, మెడికల్ కాలేజీ వైద్యులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## కుటుంబంతో కలిసి గణపతి పూజలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..



తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు

కుటుంబ సభ్యులతో కలిసి గణపతికి ప్రత్యేక పూజలు

అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగి విజయాలు రావాలని ఆకాంక్ష


పూజకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సీఎం

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 14**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం ఆయన తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి గణపతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సోషల్ మీడియా వేదికగా తన సందేశాన్ని పంచుకున్నారు. ప్రజలందరి జీవితాల్లో ఎదురయ్యే ఆటంకాలు తొలగిపోయి, ప్రతి ఒక్కరూ విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలో పాల్గొన్న ఫొటోలను ఆయన ఈ సందర్భంగా షేర్ చేశారు."వినాయక చవితి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి గణపతి పూజా కార్యక్రమంలో పాల్గొన్నాను. ప్రజలందరి జీవితాల్లో విఘ్నాలు తొలగి, విజయాలు సిద్ధించాలని ప్రార్థిస్తూ, రాష్ట్ర ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు.

## వివాదంలో సాలార్ జంగ్ మ్యూజియం..

### హైదరాబాద్ సంస్థానంపై తప్పుడు పోస్ట్!



హైదరాబాద్ సంస్థానంపై తప్పుడు మ్యాప్‌తో సాలార్ జంగ్ మ్యూజియం పోస్ట్

చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఫొటో కూడా తప్పుగా ప్రచురణ

ఇది ఏఐ-జనరేటెడ్ కంటెంట్ అంటూ జర్నలిస్ట్ ఆరోపణ

కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి వచ్చిన సమాచారంతోనే పోస్ట్ చేశారని వెల్లడి

విమర్శలు వెల్లువెత్తడంతో సోషల్ మీడియా నుంచి పోస్టును తొలగింపు

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 14**

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక సాలార్ జంగ్ మ్యూజియం సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ వివాదాస్పదంగా మారింది. నిజాం పాలన నాటి హైదరాబాద్ సంస్థానానికి సంబంధించి చారిత్రక తప్పులతో కూడిన మ్యాప్‌ను, చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు చెందిన తప్పుడు ఫొటోను తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో మ్యూజియం పోస్ట్ చేసింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో మ్యూజియం యాజమాన్యం ఆ పోస్టును తక్షణమే తొలగించింది.ఈ పోస్టులో చూపించిన హైదరాబాద్ సంస్థానం (1724--1948) సరిహద్దుల మ్యాప్ వాస్తవానికి పూర్తి భిన్నంగా ఉంది. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో సృష్టించినట్లుగా ఉందని జర్నలిస్ట్ శిరీష్ నానిశెట్టి 'ఎక్స్' వేదికగా ఆరోపించారు.కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి అందిన మెటీరియల్ ఆధారంగానే ఈ కంటెంట్‌ను పోస్ట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఉన్నత స్థాయి నుంచి వచ్చిన సమాచారం కావడంతోనే ఈ పొరపాటు జరిగిందని తెలుస్తోంది. విమర్శలు తీవ్రం కావడంతో మ్యూజియం అధికారులు వెంటనే ఆ ఫోటోలను తొలగించారు.భారతదేశంలోనే అతిపెద్ద సంస్థానమైన హైదరాబాద్, ప్రస్తుత తెలంగాణాతో పాటు మహారాష్ట్రలోని ఐదు, కర్ణాటకలోని మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండేది.

# పూజలు లేకుండానే గంగమ్మ ఒడికి గణేశుడు.

## పీర్జాపూర్‌లో ఇరువర్గాల వివాదంతో వినాయకుడి నిమజ్జనం




హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 14 :

అందరూ కలిసికట్టుగా జరుపుకోవాల్సిన వినాయక చవితి వేడుకల్లో గ్రామ రాజకీయాలు, వర్గ విభేదాలు చోటుచేసుకున్నాయి. పట్టుదలకు పోయిన రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదం కారణంగా ఓ వినాయక విగ్రహాన్ని ఎలాంటి పూజలు, నవరాత్రులు నిర్వహించకుండానే నేరుగా చెరువులో నిమజ్జనం చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం పీర్జాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో గణేష్ నవరాత్రులు నిర్వహించేందుకు శ్రీరాములు, తిరుపతి, సంగమేష్, కురువ మల్లయ్య తదితరుల బృందం ఒక విగ్రహాన్ని తీసుకొచ్చింది. అయితే, గ్రామ సర్పంచ్ ఎర్రగుమ్మ నర్సింలు ఆధ్వర్యంలోని మరో వర్గం దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది. ఆంజనేయ స్వామి ఆలయంలో కాకుండా వేరే చోట ఎక్కడైనా విగ్రహాన్ని ప్రతిష్టించుకోవాలని వారు పట్టుబట్టడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.గ్రామస్తుల మధ్య ఉద్రిక్తత నెలకొన్న సమాచారం అందుకున్న చౌదరిగూడ పోలీసులు వెంటనే గ్రామంలోకి రంగప్రవేశం చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా వివాదాస్పదమైన ఆంజనేయ స్వామి ఆలయంలో ఏ వర్గం కూడా విగ్రహాన్ని ప్రతిష్టించకూడదని ఆదేశించారు. పండుగ వేళ ఘర్షణలకు తావివ్వకుండా వేరేచోట మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీసుల ఆదేశాలతో సర్పంచ్ వర్గం వేరే చోట వినాయకుడిని ఏర్పాటు చేసుకొని పూజలు ప్రారంభించింది. కానీ, తొలుత విగ్రహాన్ని తెచ్చిన వర్గం ఈ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైంది. దేవుడి వద్ద రాజకీయాలు, వర్గ విభేదాలు తగవని ఆవేదన వ్యక్తం చేస్తూ, తాము తెచ్చిన గణేశుడికి ఎలాంటి పూజలు చేయకుండానే నేరుగా తీసుకెళ్లి గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. దేవుడి వద్ద కూడా గ్రామ పెద్దలు ఇలా గ్రూపులు కట్టడం పట్ల స్థానిక భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ఆ దేవుడే చూసుకుంటాడని విగ్రహాన్ని తెచ్చిన నిర్వాహకులు వాపోయారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బతుకులకు భద్రత ఎక్కడ?

## సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి: రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ రాజమ్మద్



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 14 :

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 5, 10, 20, 22 సంవత్సరాలుగా నిరంతరంగా సేవలందిస్తున్నప్పటికీ, నేటికీ వారికి ఉద్యోగ భద్రత లేకపోవడం దురదృష్టకరమని రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ రాజమ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖలకు సేవలందిస్తున్న ఉద్యోగుల బతుకులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో డిగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీలు చేసిన వారు సైతం ఉన్నారని, అర్హతలకు తగిన ఉద్యోగ భద్రత, వేతనాలు మాత్రం లభించడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు లేకపోవడంతో ఉద్యోగులు కుటుంబాలను పోషించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని సంస్థలు, శాఖల్లో మూడు, నాలుగు నెలలపాటు జీతాలు చెల్లించక పోవడంతో ఉద్యోగుల కుటుంబాలు దుర్భర ప రి స్థి తు ల ను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, నిబంధనల ప్రకారం నియామకాలు, మెరుగైన సేవా భద్రత లభిస్తాయని ఆశించిన ఉద్యోగులకు ఇప్పటికీ నిరాశే మిగిలిందన్నారు. గత ప్రభుత్వాలు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రజా పాలన ప్రభుత్వం అయినా వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామస్థాయి కార్యాలయాల నుంచి రాష్ట్రస్థాయి సచివాలయం వరకు దాదాపు ప్రతి ప్రభుత్వ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కీలక సేవలు అందిస్తున్నారని మహమ్మద్ రాజమ్మద్ గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో వీరి పాత్ర ఎంతో కీలకమన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు.

### జలమండలి ఉద్యోగుల వరుస మరణాలపై ఆందోళన

ఇటీవల హైదరాబాద్ జలమండలిలో ఔట్‌సోర్సింగ్ మీటర్ రీడింగ్ ఉద్యోగులు వరుసగా మృతి చెందడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు సుమారు నలుగురు ఉద్యోగులు మృతి చెందినప్పటికీ, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు తగిన భద్రత, రక్షణ కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి, ఉద్యోగ భద్రత లేకపోవడం, తక్కువ వేతనాలు వంటి సమస్యలు ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ప్రాణాలకు భరోసా కల్పించడంతో పాటు పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని కోరారు.

### సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలి

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి సమగ్ర విధానాన్ని రూపొందించాలని మహమ్మద్ రాజమ్మద్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం, సకాలంలో జీతాలు చెల్లించడం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్నారని, వారి సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన గౌరవం, భద్రత కల్పించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.ఏళ్ల తరబడి ప్రభుత్వ వ్యవస్థలో భాగంగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇకపై తాత్కాలిక ఉద్యోగులుగా కాకుండా వారి సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, సకాలంలో జీతాలు, సామాజిక భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మహమ్మద్ రాజమ్మద్ కోరారు.

## చిన్నారులపై

# సైబర్ నేరాలు

▶▶ "టింగ్ టాంగ్! ఆన్‌లైన్‌లో ఏదైనా చేసే ముందు ఆగండి.. ఆలోచించండి" ▶▶ చిన్నారులకు డిజిటల్ ప్రపంచం సురక్షితంగా ఉండేలా చేసేందుకు క్రై క్యాంపెయిన్ ▶▶ 8 ఏళ్లలో 0 నుంచి 72కు పెరుగుదల..
▶▶ ఎన్సీఆర్బీ గణాంకాలు వెల్లడి ▶▶ పిల్లలకు వినూత్నంగా అవగాహన కార్యక్రమాలు ▶▶ క్రై-- చైల్డ్ రైట్స్ అండ్ యూ




హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 14:

పిల్లలు నేర్చుకునేందుకు, ఆడుకునేందుకు, పాల్గొనేందుకు, తమ భావాలను వ్యక్తీకరించేందుకు డిజిటల్ ప్రపంచం అపూర్వమైన అవకాశాలను అందిస్తోంది. అదే సమయంలో, సైబర్ బెదిరింపులు, ఆన్‌లైన్ గ్రూమింగ్, ఫొటోలు/వీడియోల ద్వారా దుర్వినియోగం, తప్పుడు సమాచారం, గోప్యత ఉల్లంఘనలు, డిజిటల్ లైంగిక వేధింపులు వంటి కొత్త ప్రమాదాలకు కూడా చిన్నారులను గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో క్రై-- చైల్డ్ రైట్స్ అండ్ యూ(చైల్డ్ రైట్స్ అండ్ అండ్ యూ ) సంస్థ.. 'ఆన్‌లైన్‌లో ఏదైనా చేసే ముందు కాస్త ఆగండి.. రెండుసార్లు ఆలోచించండి' అంటూ 'టింగ్ టాంగ్' క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పిల్లలు, పెద్దలు ఇలా ఆగి, ఆచితూచి స్పందించడాన్ని అలవరచుకోవడం ద్వారా సురక్షితమైన డిజిటల్ ప్రవర్తనను పెంపొందించడం ఈ క్యాంపెయిన్ లక్ష్యం అని క్రై-- చైల్డ్ రైట్స్ అండ్ యూ తెలిపింది. పెరుగుతున్న ప్రమాదం నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ ) తాజా గణాంకాలను క్రై విశ్లేషించినపుడు ఈ సమస్య తీవ్రత స్పష్టమవుతోంది. 2017 నుంచి 2024 మధ్య, దేశవ్యాప్తంగా పిల్లలపై సైబర్ నేరాలు 20 రెట్లు పెరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2017లో 88 కేసుల నుంచి 2024లో 1,753 కేసులకు చేరాయి. అందులో చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్ (జూసావీ)కు సంబంధించిన నేరాలు ఏకంగా 157 రెట్లు పెరిగాయని.. 2017లో కేవలం 7 కేసులుగా ఉన్న 2024లో 1,099 కేసులకు పెరిగిపోయినట్లు నివేదిక వెల్లడించింది. అదే విధంగా తెలంగాణలో కూడా పిల్లలపై సైబర్ నేరాలు 2017లో నమోదైన కేసుల సంఖ్య సున్నా కాగా.. 2024లో 72 కేసులకు పెరిగాయని..దేశవ్యాప్తంగా ఈ కేటగిరీలో నమోదైన కేసుల సంఖ్యలో రాష్ట్రం 4 శాతం వాటాతో 8వ స్థానంలో నిలిచిందని గణాంకాలు వెల్లడించాయి. ముఖ్యంగా రాష్ట్రంలో ఈ కేసుల సంఖ్య ఏటేటా పెరుగుతూ వస్తోందని క్రై-- చైల్డ్ రైట్స్ అండ్ యూ ఆందోళన వ్యక్తం చేస్తుంది. 2024లో రాష్ట్రంలో నమోదైన 72 కేసుల్లో 12 కేసులు.. అంటే దాదాపు 17 శాతం సీఎస్ఏఎం కు సంబంధించినవే. వీటిని ఎన్సీఆర్బీ 'సైబర్ పోర్నోగ్రఫీ/ చిన్నారులతో కూడిన అశ్లీల లైంగిక చిత్రాలను పెట్టడం, ప్రచురించడం' అనే నేర విభాగం కింద వర్గీకరించింది. జిల్లాల వారీగా చూసినపుడు నమోదైన సీఎస్ఏఎం కేసులు కొన్ని జిల్లాల్లోనే ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నట్టు స్పష్టం చేసింది. 2024లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మూడు కేసులు, వరంగల్ కమిషనరేట్ పరిధిలో మూడు కేసులు చొప్పున నమోదయ్యాయి. రామగుండం కమిషనరేట్ పరిధిలో రెండు కేసులు, రాజన్న సిరిసిల్ల పరిధిలో మరో రెండు కేసులు నమోదయ్యాయని తెలిపింది. పిల్లలు చేతుల్లోని ఫోన్లు తదితర డిజిటల్ స్క్రీన్లపై జరిగే ఘటనలు కూడా ప్రభావితం చేయడం అధికమవుతోందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. అంతేకాదు.. తమనే తప్పుపడతారనే భయంతోనో, తమనే శిక్షిస్తారనే భయంతోనో చాలామంది పిల్లలు హానికరమైన ఆన్‌లైన్ అనుభవాలను బయటకు వెల్లడించకుండా మౌనంగా భరిస్తున్న ఉదంతాలూ ఉన్నాయి" అని క్రై సౌత్ రీజినల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్స్ చెప్పారు. తెలంగాణలో సైబర్ భద్రతా చర్యలుసీఎస్ఏఎం కేసులు ఎక్కువగా ఉండటం.., ఆన్‌లైన్‌లో ఇలాంటి చిత్రాల ప్రచురణను నివారించడం, వేగంగా గుర్తించడం, తొలగించడం, ఫిర్యాదు చేయడం అనేవి.. సైబర్ స్పేస్‌లో చిన్నారుల రక్షణకు చేపట్టాల్సిన అత్యంత ముఖ్యమైన చర్యలుగా చాటుతోంది. దీనితో పాటు.. డిజిటల్ బెదిరింపులు, సైబర్ స్పేస్‌లో వెంటబడడం, వేధించడం వంటి హాని నుంచి కూడా పిల్లలకు రక్షణ కల్పించడం కీలకం అని జాన్ రాబర్ట్స్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ దిశగా పటిష్ట చర్యలు చేపడుతోంది. సైబ్‌హెర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులపై దృష్టి పెడుతోందని ప్రత్యేక 'సైబర్ కాంగ్రెస్' నమూనాతో విద్యార్థి 'సైబర్ అంబాసిడర్లను', ఉపాధ్యాయులను శిక్షణను ఇస్తోందన్నారు.

### సైబర్ సవాళ్లకు సామూహిక పరిష్కారం

వయసు ధృవీకరణ వ్యవస్థలను బలోపేతం చేయడం, పిల్లల భద్రతకు సంబంధించిన ఫిర్యాదు సాధనాలను సరళతరం చేయడం అందులో భాగంగా ఉండాలి. ఇందులో సమాజం పాత్ర కూడా చాలా ఉంది" అని జాన్ రాబర్ట్స్ పేర్కొన్నారు. క్రై'టింగ్ టాంగ్' క్యాంపెయిన్ ఈ తక్షణ అవసరాన్ని క్రై గుర్తించింది. డిజిటల్ ప్రపంచాన్ని పిల్లలకు సురక్షితంగా మలచడం కోసం 'ఆన్‌లైన్‌లో ఉన్నప్పుడు రెండుసార్లు ఆలోచించండి' అనే థీమ్‌తో క్రై దేశవ్యాప్తంగా 'టింగ్ టాంగ్' ప్రచారాన్ని ప్రారంభించిందని జాన్ రాబర్ట్స్ వెల్లడించారు. డిజిటల్ నోటిఫికేషన్ లేదా అలర్ట్ శబ్దం 'టింగ్ టాంగ్'ను.. అంతర్గత హెచ్చరిక సంకేతంగా ఈ ప్రచారం ఉపయోగిస్తోందని.. నమ్మే ముందు -- టింగ్ టాంగ్. క్లిక్ చేసే ముందు -- టింగ్ టాంగ్. షేర్ చేసే ముందు -- టింగ్ టాంగ్" అని ఆయన వివరించారు. పిల్లలు, తల్లిదండ్రులు, సంరక్షకులు, ఉపాధ్యాయుల్లో అవగాహనను, డిజిటల్ సాధికారతను పెంపొందించడం, పాఠశాలలు కేంద్రంగానూ చేపట్టే చిన్నారుల రక్షణ కార్యక్రమాల్లో ఆన్‌లైన్ భద్రతను చేర్చడం... ఆన్‌లైన్ ప్రపంచంలో సురక్షితంగా సంచరించేందుకు అవసరమైన జ్ఞానం, ఆత్మవిశ్వాసం పిల్లలకు అందించడం దీని ఉద్దేశం అని ఆయన చెప్పారు. ప్రతి పౌరుడిని క్రై ఆహ్వానిస్తోందని, తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా, విద్యార్థులుగా, విధాన నిర్ణేతలుగా, సాంకేతిక నిపుణులుగా, సమాజంలోని సభ్యులుగా -- చిన్నారులకు భద్రదమైన సైబర్ వాతావరణాన్ని రూపొందించడంలో ప్రతి ఒక్కరి పాత్ర ఉంది" అని జాన్ రాబర్ట్స్ స్పష్టం చేశారు

# ప్రభుత్వం పాఠశాలల్లో నైపుణ్యాలు అరకొర


## భారీగా నిధులు వెచ్చిస్తున్న ఫలితం మాత్రం అంతంత మాత్రమే

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 14:

వివిధ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు ఒకే క్యాంపస్‌లో నాణ్యమైన విద్య, వసతి, క్రీడలు, ఇతర మౌలిక సదుపాయాలు అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తోంది.. అదే విధంగా ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది. కాగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని.. విద్యార్థుల్లో కనీస చదువు, ప్రాథమిక గణిత నైపుణ్యాలు కొరవడుతున్నాయని ఓ సర్వే అధ్యయనంలో వెల్లడైంది.

### పిల్లల్లో తరగతులకు తగ్గ నైపుణ్య

సామర్థ్యాలు లేవని, 3వ తరగతిలో నేర్చుకోవాల్సిన అంశాలను ఆ క్లాసులోనే నేర్చుకోలేకపోతున్నారని తెలిపింది. తప్పులు లేకుండా చదవకపోవడంతోపాటు లెక్కలను కూడా అర్థం చేసుకోలేకపోతున్నారని పలు సర్వేలు వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థి చదువు కోసం ఏటా సగటున రూ.1. 09 లక్షల భారీ మొత్తాన్ని ఖర్చు చేస్తోంది. ఉపాధ్యాయుల జీతభత్యాలు, మౌలిక వసతులు, ఇతర వనరుల కోసం అధికంగా నిధులు వెచ్చిస్తున్నప్పటికీ.. ఆ స్థాయిలో ఫలితాలు రాకపోవడంపై సీఎం అసెంబ్లీ వేదికగా మాట్లాడారు. భారీగా నిధులు కేటాయిస్తున్నామని, విద్యార్థుల్లో కనీస విద్యా ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నైపుణ్యాలు సామర్థ్యాలలో చాలా వెనకబడ్డారని పలు సర్వేలు వెల్లడిస్తున్న నేపథ్యంలో మార్పు తెచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. 2022–23 విద్యా సంవత్సరం నుంచి నిర్వహిస్తున్న మౌలిక భాషా గణిత సామర్థ్యాల సాధన (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ, ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ లిప్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించింది. అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రతి క్లస్టర్లో ఎక్కువ మంది విద్యార్థులున్న 3 స్కూళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 1876 క్లస్టర్ల నుంచి 5451 స్కూళ్లను ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ స్కూళ్లుగా ఎంపికచేసి వాటిల్లో తరగతికి తగిన నైపుణ్య సామర్థ్యాలు సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో 6 నుంచి 14 ఏళ్ల పిల్లల నమోదు 2022లో 62.5 శాతంగా ఉండగా ప్రస్తుతం 59.8 శాతానికి పడిపోయింది. సర్వే వెల్లడించిన వివరాల ప్రకారం.. 3 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ఏకంగా 75 శాతం మంది కనీసం 2వ తరగతి పాఠ్యపుస్తకాలను కూడా సరిగ్గా చదవలేకపోతున్నారు. ప్రాథమిక తరగతుల విద్యార్థుల్లో దాదాపు 51 శాతం మంది కనీస తీసివేతలు కూడా చేయలేకపోతున్నారని




స్పష్టం ఓ సర్వే స్పష్టం చేసింది. తరగతులు మారుతున్నా, పిల్లల సామర్థ్యం మాత్రం పెరగడం లేదని ఈ గణాంకాలు ఎత్తి చూపుతున్నాయి. చదవడమే కాకుండా, ప్రాథమిక గణిత సమస్యలను సాధించడంలోనూ విద్యార్థులు దారుణంగా వెనుకబడి ఉన్నట్టు నివేదిక వెల్లడించింది.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136